
# దేవుడా! మన్నించు..




పి.యస్.నారాయణ

మూడురోజుల క్రితం బాబాయి దగ్గర నుండి ఓ ఆటంబాంబులాంటి ఉత్తరం వచ్చింది. రెండేరెండు వాక్యాలు రాశాడు. "నేను ఆదివారం ఉదయం హైద్రాబాద్ వస్తున్నాను. ఈ విషయం సత్యానికి తెలియనీయబోకు—"

సత్యం మా బాబాయికి స్వయానా పుత్రుడు. అంతేగాదు చేతికి అందివచ్చిన పెద్దకొడుకు...ఎంబీబియస్‌లో చదవాల్సిందంతా అవగా హౌస్‌సర్జన్‌గా ముక్కుమూసుకు గడిపేస్తున్నాడు. ఆరునెలలు తిరిగేటప్పటికి గుంటూరులో ఓ యిరవైవేలయినా ఖర్చుపెట్టిఆసుపత్రిని తెరిచేయాలన్నంత ధీమాతో వున్న మనిషి దానికితోడు ఆ తండ్రి ఆశీర్వాదం వుండనే వున్నది!

నాకు ఆయన ఉత్తరమే అర్థంకాలేదు. అంత కొడుక్కు గూడా తెలియకుండా ఆయన చేయబోయే రాచకార్యం ఏమిటో బుర్ర పగలకొట్టుకుంటున్నా తట్టటమే లేదు.

ఈ మూడురోజులూ మనస్సును ఒకచోట నిలవనీయకుండా పిచ్చిపిచ్చి ఆలోచనలతో తికమకపడేస్తోంది. గంటలతరబడి మా శ్రీమతినిమంచంమీద ఎదురుగ్గా కూర్చోబెట్టుకొని కారణం ఏం వైవుంటుందా అని చర్చించినా కొరుకుడు పడనేలేదు.

ఓ క్షణాన అయితే వాడు ఆస్తినిగాని పంచేయమని అడగలేదుగదా అనే అనుమానమూ వచ్చింది—కానీ ఈ బక్క వెధవ అలాంటి కోరికకోరి మా బాబాయి ముందు బ్రతికి వుంటే? తనదగ్గర తుపాకీ లేకపోతే వున్న వాడి నెవడినైనా నాలుగు తన్ని తీసుకువచ్చి కాల్చిపారేసేటంతటి ఘనుడు ఆయన—అనిగూడా చెప్పేసుకున్నాను.

సరే! యిక తెల్లవారితే ఆయనే దర్శనమిస్తాడు గదా!

నా అదృష్టం—ఆ సత్తిగాడు ఈ మూడురోజులూ నా కంటపడలేదు..'ఏరా అన్నయ్యా! మా నాన్నదగ్గరనుంచి ఉత్తరమేమైనా వచ్చిందా?'అనినోరుతెరిచి అడిగితే — ఆత్మనల్లా వంచించుకొని, 'లేదురా తమ్మయ్యా!' అని అనాల్సొచ్చేది!

* * *

సరిగ్గా ఏడుగంటలకు ఇంటిముందు టాక్సీ ఆగింది. ఇంకెవరు?

—సాక్షాత్తు మా బాబాయి టాక్సీడోరు తెరుచుకుని ఆ నిలువెత్తు ఏడుకొండల వెంకటేశ్వరుడిలా వాకిట్లో నిలబడి దర్శనమిచ్చాడు. నేనే వడివడిగా ఎదురు వెళ్ళి, ఆహ్వానసూచకంగా మందస్మిత వదనారవిందుడనై ఆయనవైపు ఓ క్షణం చూసి టాక్సీ డిక్కీ ఎత్తుతున్న డ్రైవర్ ప్రక్కకు వెళ్ళి, పెట్టే బెడ్డింగ్ చేత్తో తీసుకొని, "పదండి బాబాయి, లోపలికి!" అన్నాను.

ఆయక ఓరగా మీటర్ వంక ఓ క్షణం చూచి అయిదు రూపాయిల నోటును డ్రైవర్ చేతిలోపెట్టి చిల్లరకోసం గూడా ఎదురుచూడకుండా లోపలకు అడుగులు వేశాడు. ఆయన వెనుకగా నేను పెట్టే బెడింగ్‌తో...

"నమస్కారం మామయ్యగారూ!" మెడవరకు చీరెకొంగు కప్పుకున్న మా శ్రీమతి తలుపవతలే నిలబడి నమస్కరించింది. "అత్తయ్యగారూ, పిల్లలూ కులాసానా?"

అన్నిటికీ హుందాగా తల ఊపేసి, బుజంమీది జరీఅంచు కండువాను సోఫామీదకు విసిరివేస్తూ, "స్నానం చేయాలి వేణ్ణీళ్ళు పెట్టించు ... అరేయ్, శేషగిరీ! ఇవాళ్ళనీవు ఆఫీసుకు శెలవు పెట్టేయ్.... ఇదుగో అమ్మాయ్, సరోజా!....బెడింగ్ విప్పి తువ్వాల తియ్! ఆర్డరు జారీచేశారు ఆయన.

ఇద్దరం, 'అలాగే' అన్నట్లుగా తలలూపాం.

ఆయన స్నానంచేసి వచ్చేటప్పటికి ప్రెస్టీజ్ కుక్కర్‌లోనుంచి అప్పుడే తీసిన ఆవిర్లుతేలే ఇడ్లీలు ప్లేట్‌లోపెట్టి, కొత్త ఆవకాయ, కరివేపాకు కారం ఆధరవులుగా అమర్చి, ఆ రోజే పగలగొట్టిన అగ్‌మార్కు నేతి డబ్బాలోనుంచి ఓ గిన్నెడు నేతితోసహా మా ముందు అమర్చింది.

ఆయన అలా అలా ఓ అయిదారు ఇడ్లీలను నేతిలోముంచుకుతిన్నతరువాత, "ఆఫీసుకు సెలవుపెడుతున్నావుగదా!" అన్నారు ఓరగా నావంకచూస్తూ.

"ఆఁ.." అన్నాను... ఆయన మీసాల వంకే 'మిమ్మల్ని కాదనే ధైర్యం ఎక్కడుందండీ బాబాయిగారూ' అన్నట్టుగా చూస్తూ.

"అరగంటలోతయారవ్వు!"అన్నారు ఏదో ఇడ్లీని సగానికి తుంచుతూ.

"మీరు విశ్రాంతి తీసుకోరా?"

"నా విషయం నాకు తెలుసులేవోయ్.. నేను చెప్పినట్లు చెయ్యి!"

సరిగ్గా ఆయన అన్నట్లుగానే మరో అరగంటలోనే ఇంట్లోనుంచి బయటకు వచ్చాం.

'ఎక్కడికి?' అని అడిగే ధైర్యం నా కెక్కడిది?

ఓ అడుగు వెనకగా ఆయన్ను అనుసరించటమే అన్నివిధాలా శ్రేయస్కరం!

నాలుగు అడుగులువేశామోలేదోఖాళీగా పోతున్న ఓ టాక్సీని మా బాబాయి వేలెత్తిఆపారు. అందులో ఎక్కాం.

సూర్యుడు ఎవ్వడో తరుముకువస్తున్నట్లుగా పైకి పరుగెత్తుతున్నాడు. ఈ సంవత్సరం హైద్రాబాద్‌లోనూ ఎండలు తినేస్తున్నయి. ఎప్పుడూ పట్టని చెమట మనుష్యులకుపట్టి ఏడిపించేస్తోంది.

అప్పుడే అంత ఎండఎక్కిందా అనుకుంటూ టైంచూచుకుంటే తొమ్మిది దాటింది.

టాక్సీలో నా పక్కన్న కూర్చున్న ఆయన మొహంలోకి భయంగాచూశాను.

--ఉద్దండపిండంలాంటి మా బాబాయి ఇప్పుడేదో గట్టిచిక్కులో ఇరుక్కున్నట్లే అనిపించిందినాకు. అందునా అది ఆయన గారి పుత్రరత్నం—అర్చకుడు సత్యం—తెచ్చి నెత్తినపెట్టిన కుంపటే అయితే ఇంకా అనుకోవాల్సిం దేమున్నది?

ఆయన మా వూరిని ఏకఛత్రాధిపత్యంగా ఏళ్ళతరబడి ఏ పదవీలేకుండా ఏలుతున్న పెద్దమనిషి. ఆయన వేలెత్తి కనుసైగచేస్తే ఊరు ఊరంతా చేతులు కట్టుకొని వాకిట్లోనిలబడుతుంది. ఆయన 'కుందేటికి మూడేకాళ్ళు' అంటే 'కాదు' అనేదమ్మున్నవాడు ఇంతవరకూ కనబడలేదు. కాదూ గూడదూఅని ఏఅర్థాయుష్కుడోలోపలే నసుక్కున్నా వాడి తల మరునాటినుండి ఆఊళ్ళో కనబడనూలేదు.

—అలాంటి మా బాబాయిగారి ప్రక్కన్న సింహంముందు లేడిపిల్లలా తలవంచుకు నేను కూర్చున్నాను.

"ఇదుగో ఇది చదువు!"అంటూ జేబులోనుంచి ఓ కాగితం తీసి నా చేతిలో పెట్టారు.

దేవుడి గుళ్ళో అర్చకుడు అర్థగంటసేపు నిలబెట్టి చేతిలో కాస్త ప్రసాదం విదిలించినంత సంతోషంతో అందుకొని త్వరత్వరగా చదవసాగాను.

"శ్రీ వెంకటేశ్వరరావు గారికి,

నమస్కారములు. మీ పుత్రరత్నం సత్యనారాయణ ఈ హైద్రాబాద్‌లో కృష్ణ పరమాత్ముడే అవగా శారద అనే ఓ రాధచేతిలో కీలుబొమ్మ అయ్యాడు.

మీవాడిని ఆ నిలయంనుండి రక్షించుకోవాలీ అనుకుంటే వెంటనే అన్నీ సర్దుబాటు చేసుకోవటం అన్ని విధాలా శ్రేయస్కరం. ఆ అమ్మాయి చిరునామా ఈ క్రింద పొందుపరుస్తున్నాను...

ఇట్లు
మీ శ్రేయోభిలాషి.

అదాటుగా తలెత్తాను.

ఇదాజరిగింది?...ఊహించనైనా లేకపోయాను...

సత్యం ఇలాంటి పని చేశాడా? ... వెధవ, నోట్లో వేలుపెడితే కొరకలేనట్లుంటాడే...

ఎదురుగా బుర్రమీసాలపైన ఎర్రబడిపోయివున్న మాబాబాయిగారి కనుగుడ్లు నన్ను భయపెట్టి సత్యం మీద జాలిని కురిపించాయి.

'నాయనా! సత్యంతండ్రీ...నీ కిదేం బుద్ధిరా...మీ నాన్న నీవు కొండమీద కోతిని కావాలన్నా తెచ్చి చేతిలో పెడతాడే...ఎవ్వరో ఓ అణాకానీ అమ్మాయి చే తి లో ఇ లా ఇరుక్కుపోవట మేమిటిరా ?"

"చదివావా?" అన్నారు నా వంక సూటిగా చూచి. తల ఊపాను.

"పెద్దవాడివి నీ విక్కడ వుండి అమాత్రం కనిపెట్టలేకపోయినావా'' అని నా తలవాచేటట్లు తిట్టిపోస్తాడేమో నని మనస్సులో భయం పీకుతోన్నా చేయగలిగిందేంవున్నది?

"మరి...ఇప్పుడు..."

'చూస్తూవుండరా... ఏంచేస్తానో...' అన్నట్లుగా నావైపు ఒక చూపు విసిరి ఆయన ముందు చూడసాగారు.

అప్పుడే మాటాక్సీ పంజగుట్ట పోలీస్ స్టేషన్‌ప్రక్కగా సందుమలుపు తిరిగింది...మమ్మల్ని ఆపైనున్న ఏడుకొండలస్వామి దగ్గరికే జేరుస్తున్నదా అన్నట్లుగా మెలికలుతిరుగుతూ పైపైకి పోతున్నది...

సత్యానికి ఇంతధైర్యం ఎక్కడినుంచి వచ్చింది?

"ఈ రోజున వాడిఅంతు తేల్చేస్తాను.. ముందు ఇట్నుంచి నరుకొద్దామనే వాడికి గూడా తెలియనీయవద్దన్నది......నాతో వేషాలంటే అల్లాటప్పా గోంగూర అనుకున్నాడేమో !" అన్నాడు తల తిప్పకుండానే.

'నిజమే ... ఈయనగారి సంగతి వాళ్ళకు తెలిసివుండదు...మనుష్యులనే చిటికెల్లో మింగివేయగల సమర్థుడు ... వాళ్ళకు రోజులు మూడినట్లే లెఖ్ఖ.'

మా బాబాయిముందుకువంగి అడ్రసు మాత్రమే కనబడేలా మడతపెట్టిన ఉత్తరాన్ని డ్రైవర్‌కు చూపించాడు.

డ్రైవర్ టాక్సీని కాస్త స్లోచేసి గేట్ల

దగ్గరగా ఇంటినంబరు చూస్తున్నట్లుగా పోనిస్తూ ఓ పెద్ద మేడముందు ఆపాడు.

"ఈ యిల్లేనా ?..." ఇంటినంబరునీ, ఇంటినీ మార్చి మార్చి చూదాడు మా బాబాయి అనుమానంగా...అయినా ఆ ఉత్తరంలో ఇంటినంబరు ఆ ఇంటిమీది నంబరూ ఒక్కటే అవడంతో అదే ఇల్లు అని అనుకోక తప్పలేదు. మా బాబాయి నేనూ దిగాం.

కళ్ళముందు రెండంతస్థుల మేడ... రంగురంగుల అద్దాలతో వెలిగిపోతోంది. అసలు సరాసరి గేటులోనుంచే లోపలికి పోయి టాక్సీని పోర్చ్‌లో ఆపేస్తే బాగుండేదేమో ననిపించింది నాకు ఒక్క క్షణం. కాని, ఆయన దిగడంతో నాకూ ఆయనను అనుసరించక తప్పలేదు.

అప్పుడు సరిగ్గా తొమ్మిదిన్నరయింది. సూర్యుడు ఇంకా బారెడు పైకెక్కి మా బాబాయిలాగానే చిటపటలాడుతున్నాడు. ఆ ఎండ వేడికి భయపడుతున్నట్లుగానే చుట్టుపక్కల జనం గూడా ఎక్కడా కనబడటంలేదు. అంత పెద్ద ఆవరణలో మాకు మేమే చాలా చిన్నవాళ్ళలాగా కనబడ్డాం.

మా వూరికి రాజయిన మా బాబాయి గారి ముఖంలోకి చూస్తే ఆయనలోనూ ఆ బంగళాముందు కాస్త తటపటాయింపే కనిపించింది.

క్రోటన్ మొక్కల పక్కగా ముందుగా ఆయన, ఆయన వెనుకగా నేనూ నడుస్తున్నాం.

ఆయన జరీఅంచు కండువాను ఒక్కసారి ఠీవిగా సర్దుకొన్నారు. ఆయన బుర్ర మీసాలపై చేయివేసి సర్దుకున్నారు. ఆయన అడుగులు త్వరత్వరగా వేయ సాగారు.

ఒక్క క్షణం ఆయన్ని పరీక్షగా చూస్తే—ముందు ఏంచేయాలో ఒక నిర్ణయానికి రాలేనివాడిలా తడబడుతున్నట్లనిపించింది.



ఆయన అలా నడుస్తూనే వున్నాడు. ఓ స్కూటర్ మామీదగా వెళ్ళినంతవిసురుగా వెళ్ళి పోర్చ్‌లో ఆగింది. అందుమీదున్న 'సత్యం' అనబడే అర్భకుడు ఆ బంగళా లోపలికిచూస్తూ 'హల్లో' అన్నాడు. ఆపైన ఆ 'హల్లో'కి సమాధానంగా ఓ సీతాకోకచిలుక 'హాయ్' అంటూ బయటకు వచ్చింది.ఆ అమ్మాయి ఇంద్రలోకం లోనుంచి దిగివచ్చిన అప్సరసలావున్నది. ఆమె రెండే రెండు జడలు వేసుకున్నది. గోళ్ళకు రంగుగూడా వేసుకున్నది. బుగ్గలకు గులాబీరంగు అద్దుకున్నది. కాళ్ళకు అడుగెత్తుచెప్పులు వేసుకుంది. ఆమె నడుస్తుంటే హంస నడుస్తున్నట్లున్నది. త్వరత్వరగా మెట్లుదిగుతుంటే జిరాఫీ దిగుతున్నట్లున్నది—ఆ అమ్మాయి పేరేకాబోలు ఆ శ్రేయోభిలాషి ఉత్తరంలో 'శారద' అని వున్నది!

ఆ అమ్మాయి ఒక్కఎగురు ఎగిరింది సత్యంగాడి స్కూటర్ మీదకు. వాడిని బల్లిలా కరుచుకుపోయింది.

వాడు విసురుగా ముందుకు దూసుకు పోయాడు. — అదంతా ఓ పావు నిముషంలో జరిగిపోయింది!

నేను ఆదుర్దాగా ముందుకు వంగి చేయి చాపుతూ 'సత్యం' అని పిలవబోయాను.

మా బాబాయి నా చేయిపట్టుకొని "ఊ..." అన్నారు వారిస్తున్నట్లుగా.

స్కూటర్ గేటుగూడా దాటిపోయింది.

నేను నిట్టూర్పు విడిచాను— వీడు ఇంతగా బరితెగిస్తాడనినేను కలలోగూడా అనుకోలేదు— తలెత్తి బాబాయి ముఖం

లోకి చూద్దామనుకున్నానుగాని అలా చూసే ధైర్యంలేక తలవంచుకొని పిల్లిలా ఆయన వెనకే అడుగులు వేయసాగాను.

—ఏ క్షణానైనా అగ్నిపర్వతం బ్రద్దలవ్వవచ్చు!

ఆయన మొజాక్‌ఫ్లోర్ మెట్లమీద ఎక్కడజారిపడతానో అన్నంత జాగ్రత్తగా కాలుపెట్టాడు. మెట్లెక్కి తలెత్తి కాలింగ్ బెల్ నొక్కాం-రాజకీయదురంధరుడు కాబట్టి మినిస్టర్లు, వాళ్ళ బోటివాళ్ళు ఇళ్ళకు వెళ్ళటం ఆయనకు మంచినీళ్ళ ప్రాయమే!

తెల్లదుస్తుల్లో వున్న పనివాడు ఎవ్వరన్నట్లుగా వచ్చాడు. మా బాబాయిగారి విగ్రహాన్ని చూస్తూనే 'చాలాగొప్పవాడిని' చూసినంత హడావుడిపడిపోతూ, "రండి రండి," అంటూ వెనక్కు అడుగులు వేయసాగాడు.

నాకు వింతగానే తోచింది అతగాడి ప్రవర్తన.

మా బాబాయిగారు నావంక ఠీవిగానూ, గర్వంగానూ చూచారు.

"అలా కూర్చోండి..." పనివాడు పైకి వెళ్ళాడు.

తరువాత రెండునిముషాలకే ఓ స్టీలు పళ్ళెంనిండా యాపిల్ ముక్కలూ ఆ పైన రెండుగ్లాసులతో తెల్లటి చిక్కటి పాలు, చిన్ని వెండిడబ్బాలో యాలక్కాయల గింజలూ రావటం-మేం ఆరగించటం గూడా అయిపోయింది.

—నాకు అనుమానంగానే ఉన్నది-అతగాడు మమ్మల్ని ఎవ్వరిగానో ఊహించుకొని ఈ రాచమర్యాదలన్నీ చేస్తున్నాడా అని...నిజం తెలుసుకొని బయటకు నడవమనడుగదా...ఎంత ఆఫీసరయినా అలాంటి భయంతోటి గుండెలు బితుకుబితుకుమంటూనే వున్నాయి...

అన్నీ అయిన తరువాత అతడే మా దగ్గరకు వచ్చి, "అయ్యా! ఫాను వేయమంటారా!" అని అడిగాడు.

"వద్దులే!" అన్నాను నేను చేయి ఊపుతూ-ఆ పరిసరాలలో నాకు చెమట పడుతున్నమాట వాస్తవమేగాని...అది ఫ్యాను గాలికి తగ్గేనా అని!

మా బాబాయి ఆ సోఫాలో వెనక్కు జారగిలబడి కాళ్ళూపుతూ పైన వేళ్ళాడుతున్న చాండిలియర్స్‌ను చూస్తున్నాడు. అలా కూర్చున్న ఆయనలో కాస్తంత ఠీవి, ఔన్నత్యం పెరిగినయ్యేమో ననిపించింది.

అలా మా బాబాయి పైకి చూస్తుండగానే మేడమెట్లమీద పాదాల సవ్వడి అయింది. ఆపైన తలెత్తితే ఓ లావుపాటి స్త్రీ మెట్లుదిగుతూ కనబడింది. ఆమె పొడుగ్గా వున్నది. లావుగావున్నది. చుట్టచుట్టుకున్నది! కళ్ళకు గోల్డ్‌ఫ్రేం కళ్ళజోడు పెట్టుకున్నది. హుందాగా శాలువా కప్పుకున్నది.

ఆమె మెట్లు దిగుతూనే, మా బాబాయి వంక నవ్వుతూ చూస్తూ, "నా లెఖ్ఖరయిటయితే మీరు సత్యనారాయణగారికి తండ్రి అయివుండాలి!" అని అంటూనే, "నానమస్కారాలు స్వీకరించండి!" అంటూ రెండు చేతులూ జోడించింది.

అంత చెట్టంత మా బాబాయి ఆమె కంఠానికి తడబడటం నాకు విస్మయాన్నే కలిగించింది.

"నమస్కారం... నమస్కారం..." అన్నాడు లేచి నిలబడుతూ.

"కూర్చోండి...ఈ రోజు నాకు సుదినం...ఎప్పుడెప్పుడు మిమ్మల్ని కలుద్దామా అని ఎన్నాళ్ళగానో ఎదురు చూస్తున్నాను...అనుకోకుండా ఆ శుభదినం ఈనాడే అయికూర్చున్నది!" అన్నది.

మా బాబాయికి ఇంకేం మాట్లాడాలో క్షణం అర్థంకాలేదు.

ఆమెను చూచేటంతవరకూ ఆయన ఆలోచనలు ఆయనవి...ఆ తరువాత...

"అవునవును...మిమ్మల్నీ నేను చాలా రోజులబట్టి చూద్దామనే అనుకుంటున్నాను!" అన్నాడు నసుగుతున్నట్లుగా. "కానీ దేనికైనా కాలం కలిసిరావాలి గదండీ!"

ఆమె ఠీవిగా నవ్వింది.

"ఈ రోజు అన్నివిధాలా మంచిదే... ఇక మీదే ఆలస్యం!" అన్నది.

అంటూనే కనురెప్పలెత్తి ఓరగా పనివాడివంక చూస్తూ, "అమ్మాయిని పిలు!" అన్నది, వేలెత్తి మేడమీదకు చూపిస్తూ.

"అమ్మాయిగారు కాలేజీకి వెళ్ళారండీ...అయ్యగారు వచ్చి తీసుకు వెళ్ళారండీ...!" అన్నాడు వినయంగా.

ఆమె చిరుదరహాసం చేసింది.

"చూశారా! అన్నయ్యగారూ...ఇదీ ఈకాలం పిల్లల పద్ధతి...అయినా నన్ను క్షమించాలి...మాటమాత్రం ముందుగా మీరొస్తున్నట్లు తెలిస్తే ఇద్దరినీ ఇల్లు కదలనిచ్చేదాన్నేగాదు!"

నిలువెత్తు మా బాబాయి ఆమె ముందు ఓ అడుక్కు ఎందుకు కుంచించుకుపోయాడో నాకు అవగతమే కావటం లేదు. ఆమె డబ్బును చూసి జారిపోతున్నాడా? ఆమె హుందాతనాన్ని చూసి భయపడుతున్నాడా?

"అమ్మాయి తండ్రి...?"

ఆమె దిగులుగా ముఖంపెట్టింది.

"వారు మమ్మల్ని ఒంటరిగా వదలి వెళ్ళి రెండు సంవత్సరాలయింది... అప్పటినుండి తల్లినయినా, తండ్రినయినా దానికి నేనే!"

మా బాబాయి జాలిగా ఓ నిట్టూర్పు విడిచాడు.

'బాబాయి! నిన్ను నీవు గుర్తుంచుకో' అన్నట్లుగా నేను చిన్నగా దగ్గాను.

ఆమె ఓరగా నా వంక చూసింది.

"వీడు మా అన్నయ్య కొడుకు... ఓ పెద్ద కంపెనీలో ఆఫీసరు!" అన్నారు మా బాబాయి నా ఉద్యోగ

హోదాను ఠీవిగా చెప్పటానికి ప్రయత్నిస్తూ.

"చాలా సంతోషం...నమస్కారమండీ!"

అయిదునిముషాల తరువాత అలా తాపీగా మాట్లాడుతున్న మా బాబాయి కాస్తా ఉన్నట్లుండి బిగుసుకుపోయి, "మా అబ్బాయికి ఇప్పుడప్పుడే పెళ్ళి చేయదల్చుకో లేదు...అది చెప్పటానికే వచ్చాను!" అన్నాడు గంభీరంగా.

ఆమె ఫక్కున నవ్వింది.

"ఇప్పుడు తొందరేమీ లేదు అన్నయ్యగారూ!...పిల్లల పరీక్షలు కానివ్వండి!" అన్నది.

మా బాబాయికి తరువాత ఏం మాట్లాడాలో అర్థంగాక పైకీ క్రిందకీ చూడసాగాడు. కాసేపు తల ఊపాడు, అప్పుడప్పుడూ కాళ్ళుగూడా ఊపుతున్నాడు.

తరువాత లేచి నిలబడుతూ, ఇక నాకు శెలవిప్పించాలి!" అన్నాడు రెండు చేతులూ జోడించి.

"అదేవిటి?...అప్పుడే శెలవేవిటి?. కాలేజీనుంచి అబ్బాయి వస్తాడుగదా... లేకపోతే ఫోను చెయ్యమంటారా? ఇద్దరూ ఇప్పుడే వచ్చేస్తారు.. మీరు అమ్మాయిని చూసినట్లూ వుంటుంది" ఆమె లేవ ప్రయత్నిస్తూ అంది.

"అబ్బెబ్బే...ఇప్పుడేమీ వద్దండీ... అబ్బాయికి నచ్చితే నాదేవీలేదు...సరి సరి...అనుకోకుండా నే నేదో పనిమీద ఈ ఊరు వచ్చాను. సాయంత్రమే వెళ్ళిపోవాలి గూడా..,అబ్బాయి అన్ని వివరాలూ రాశాడు లెండి..అందుకనే మిమ్మల్ని ఒకసారి చూసి వెళ్దామని!"

ఈయనగారి మాటలకు అవాక్కవటం నా వంతు అయింది!

ప్లేట్లు ఫిరాయించటంలో మా బాబాయిని మించిన పెద్దమనిషి మరెవ్వరుంటారు?

"సరే అన్నయ్యగారూ! నేను ఇక చెప్పేదేవున్నది. మీరు ఎప్పుడు 'శుభం' అంటే అప్పుడే అక్షింతలు కలిపించేస్తాను!" అన్నది ఆమె తన రెండు చేతులనూ జోడిస్తూ.

ఆ యింటినుంచి బయటపడిం తరువాత నాకేదో పెద్దరిలీఫ్ దొరికినట్లనిపించింది. అంతేకాదు...అన్నిటికీమించి మా బాబాయి ఎత్తుగడ 'ఇదీ' అని తెల్సుకోవటానికి మనస్సు తాపత్రయపడుతోంది.

వచ్చిన టాక్సీని పంపివేయటం తన గౌరవానికే భంగం అన్నట్లుగా మొఖం చిట్లించారు మా బాబాయి.

ఇద్దరం రోడ్డెక్కాం.

"శ్రేయోభిలాషిట...శ్రేయోభిలాషి. ఇంత మంచి సంబంధాన్ని కాలదన్నుకునేటంత పిచ్చివాడి ననుకుంటున్నాడా నేను..మళ్ళా మరోకంటికి ఈ విషయం తెలిసేలోగానే ఆ మూడు ముళ్ళూ వేయించేస్తాను" అన్నాడు నా వంక ఠీవిగా చూస్తూ. "నన్ను మించినవాడు మావాడు..."

అంతకు కొద్ది నిమిషాలకు ముందే నా నోరు పడిపోయింది. ఇప్పుడు నా కాళ్ళు, చేతులూ గూడా పడిపోయినయి!

ం ం ం

ఆ రాత్రే మా బాబాయి వెళ్ళినగంటకు సత్యం మా యింటికి వచ్చాడు...ఊగుకుంటూ.

ఎదురెళ్ళి ప్రేమగా వాడి చేతిని నా చేతిలోకి తీసుకుంటూ, "హార్టీ కంగ్రాట్స్‌రా" అన్నాను.

"థాంక్యూ!" అన్నాడు సన్నగా నవ్వి.

నాకు ఆశ్చర్యమేసింది — కారణమేవిటో గూడా తెలుసుకోకుండా నా అభినందనలు స్వీకరించినందుకు!

"దేనికని అడగవేం?"

"నా పెళ్ళి నిశ్చయమయిందనేగా?"

"నీ కెలా తెలుసురా!" నోరు తెరచుకు అడిగాను. "శారదతల్లి చెప్పిందా?"

"నాకు అన్నీ తెలుసు అన్నయ్యా!... కానీ నాన్నకూ, నీకే ఏమీ తెలియంది!"

"ఏవిటిరోయ్ అది!" వింతగా అడిగాను.

"మరో మానవుడికి చెప్పనంటే అన్నీ చెబుతాను! ఎప్పటికయినా నీవే నన్ను మా నాన్నగారినుండి కాచుకోవాల్సిన వాడివి!"

"చెప్పు!" అన్నాను అనుమానంగా వాడి మొఖంలోకి చూస్తూ. వాడు చిన్నగా నవ్వి, "ఆ శ్రేయోభిలాషిని నేనే!.." అన్నాడు

"అంటే..." విభ్రాంతిగా అడిగాను.

"ఆ ఉత్తరం రాసింది నేనే నన్నయ్యా."

"అంత అవసరమేం వచ్చింది"?

వాడు ఒక్కక్షణం కళ్ళు రెపరెపలాడించాడు. "ఆస్థి విషయంలో వాళ్ళు మనతో సరితూగలేరుగనక...ఈ నాటకమాడవలసి వచ్చింది...ఆ యిల్లు మా మిత్రుడిది..ఆ తల్లీకూతుళ్ళు ఒకపూట ఆ యింట్లో వున్నారు!"

"—ఆ పూటలోనే మీ నాన్న వస్తాడని నీవెలా అనుకున్నావ్." నాకు ఇంకా అనుమానంగానే వున్నది – ఆ వెధవ నాకైనా నిజం చెబుతున్నాడా?

"నాన్న అక్కడ బయల్దేరటం... అమ్మ ఫోనులో మాట్లాడటం అన్నీ ఒక్కసారే జరిగినయి.." వాడు తల వంచుకుని బుద్ధిమంతుడిలా చెబుతున్నాడు...

ఇక నేనేం మాట్లాడేది?

ఓ దేవుడూ! ఈ కాలపు పిల్లల్ని నీవే రక్షించాలి.

—బాబాయిగారూ! ఈ పిల్లల్ని మీరు మన్నించాలి!

———